# క్షమించు, నేస్తం

ఉదయించిన సూర్యుడికి వేడెక్కే వయసొచ్చింది,

వయసు మళ్ళిన సూర్యంగారికివాళ మళ్ళీ ఇరవయ్యో ఏడు వచ్చినట్టుగా ఉంది.

వాలు కుర్చీలో కూచుని ఎప్పుడూ లేనిది ఇవాళ కూనిరాగం కూడా తీస్తున్నారు.

అతనికీ రోజు స్తిమితంగా కూర్చోవాలనిపించటం లేదు. ఇల్లంతా తిరగాలనుంది. అందర్నీ పలకరించి మాట్లాడాలనుంది. అతనిలో ఉత్సాహం ఉరకలు వేస్తూంది.

నిన్నటి వరకూ కుంగతీసిన నిరాశా, వెక్కిరించిన ఒంటరితనం, భయపెట్టిన బెంగలూ, దిగజార్చిన దిగుళ్ళూ ఇవాళ అతనిలో లేవు.

చుట్టూ నైరాశ్యాన్ని పోగు చేసుకుని, బిక్కుబిక్కు మంటూ నీడల్లాంటి ఆలోచనల్లో మునిగిపోయి నిర్లిప్తంగా ఉండే సూర్యంగారిలో ఈ దినం ఆ ఛాయలే లేవు.

గోడ గడియారం పది గంటలు కొడుతూంది ఆ చప్పుడతనికి ఇష్టం. అరగంటకోసారి నిశ్శబ్దాన్ని చీలుస్తూ 'టంగ్' మని మోగే ఆ చప్పుడతనికెంతో నచ్చుతుంది. ఇవాళ ఆ గంటలు అతన్ని మరింత ఆకర్షించాయి. వోపిగ్గా ఒకటీ, రెండూ, మూడూ అంటూ లెక్క పెట్టడం ప్రారంభించారు.

హమ్మయ్య. పదయింది.

పది గంటలు అవంది ఎప్పుడు?

రోజూ అవుతుంది.

కాని ఇవాళ దానికో ప్రత్యేకత ఉంది. తన దృష్టిలో గుర్తింపు ఉంది.

మహా చైతన్యానికి ముందు కదలిక అది. వేకువని సూచించే 'కొక్కొరొకో' గొంతు లాంటిదది. ఇదేవిటివాళ తను ఇంత భావుకతతో ఆలోచిస్తున్నాడు? ఇంతగా ఉద్వేగానికి లోనవుతున్నాడేం తను? అని అతను ఆశ్చర్యపోయారు. అతనికి నవ్వొచ్చింది. అవును. గాలీ వెలుతురూ లేని చీకటి కొట్లో కాంతిపుంజం వికసించి విస్తరిస్తే ఎంత అద్భుతంగా ఉంటుంది! ఎంత ఉత్తేజకరంగా ఉంటుంది!

ఇవాళ అదే జరగబోతూంది.

సరిగ్గా మరో అరగంటలో టాటా ఎక్స్‌ప్రెస్ వస్తుంది.. ఆ తరువాత మరో అరగంటలోపల రామం వస్తాడు, చక్రవర్తిగార్ని వెంట పెట్టుకుని, మొన్నటి నుంచీ ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్నాడు తను.

తను ఒంటరి పక్షి కాదు.. తనకీ ఒక గుర్తింపు ఉంది.. తనని పలకరించి మాట్లాడ్డానికీ ఒక మనిషి వున్నాడు. ఆ సంగతి ఇవాళ ఋజువు కాబోతూ ఉంది. అందుకే ఈ ఆనందం.. అందుకే పట్టరానంత ఉద్వేగం.

'ఈ సంగతి చెబుదామంటే ఇవాళ నేస్తం ఇంకా రానేలేదు.' అనుకున్నారు సూర్యంగారు.

'కాఫీ' మనవరాలు కల్యాణి గొంతు. కాఫీ గ్లాసు స్టూలు మీద పెట్టిన చప్పుడు. చప్పున ఇంట్లోకి పరిగెత్తి పారిపోయినట్లు పట్టు పరికిణి రెపరెపలు.

సూర్యంగారు బాధగా నిట్టూర్చారు.

పదేళ్ళు నిండని పిల్ల... కనీసం అదయినా తనతో ఆత్మీయంగా మాట్లాడకూడదూ? ఊహూఁ.తనా అదృష్టానికి నోచుకోలేదు. ఆ పిల్ల 'తాతయ్యా, అని పిలిస్తే తన ఒళ్ళు పులకరించి పోదూ, తన బతుకు ధన్యమై పోదూ?

కాని.. కళ్యాణి అలా పిలవదు. ముక్తసరిగా విరిచినట్లు మాట్లాడ్డం దానికీ అలవాటయింది. కోడలు శకుంతల ట్రయినింగు మరి, ఆ రుసరుసలు, విసవిసలు తల్లి దగ్గరే నేర్చుకుంది. పసిపిల్ల, దానికేం తెలుస్తుంది? కోడలు మనస్తత్వపు మసి మరకలు ఆ పిల్ల పసిమనసు మీద చెరగని ముద్రలు వేశాయి..

అబ్బాయి శ్రీను మాత్రం? వాడూ అంతే. వాడూ తనతో సరిగా మనసు విప్పి మాట్లాడడు. అసలంత తీరికే ఉన్నట్లు కనిపించదు వాడికి.

ఆఫీసుకి వెళ్ళేటప్పుడయినా, కనీసం 'వెళ్ళొస్తాన్నాన్నా!' అనడు. వచ్చేకయినా మనసారా పలకరించడు. ముట్టీ ముట్టనట్టు వ్యవహరిస్తాడు.

ఎప్పుడయినా ఇంటికి రావటం ఆలస్యమైనప్పుడు తను వాడి కోసం ఎదురుచూస్తూ భోజనం చెయ్యకుండా కాచుకుని కూచున్నప్పుడు మాత్రం 'మీరు భోజనం చేసేలేక పోయేరా! నాకోసం ఎందుకు చూడటం?' అంటాడు. అందులో విసుగుదల తప్పించి అభిమానం కనిపించదు. ఆత్మీయత తొంగి చూడదు.

తనెవరికీ అక్కర్లేదు. ఎవరికీ అక్కర్లేని తను ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ కూచోవలసిందే.

టైంకి కాఫీ వేళ కింత ముద్ద.. అంతే! ఆ ఇంట్లో తనకి గుర్తింపు అంతవరకే. తిండి కన్నా ముఖ్యంగా తను కోరుకునేది వేరే ఉందని ఎవరూ గుర్తించరేం? తన ఆవేదన ఎవరూ పట్టించుకోరెందుచేత.. సూర్యంగారి కళ్ళలో నీళ్ళు తిరిగాయి...

అతనికి భార్య గుర్తొచ్చింది. సరస్వతి ఉంటే తనకీ గతి పట్టి ఉండేది కాదు! తను కూడా దర్జాగా అందరి లాగే ఉల్లాసంగా గర్వంగా బ్రతగ్గలిగేవాడేమో-

అన్నీ ఇచ్చిన భగవంతుడు చూపు మాత్రం సరిగ్గా ఇవ్వలేదు తనకి. చిన్నప్పటి నించీ దళసరి కళ్ళద్దాలు పెట్టుకోవలసి వచ్చింది. ఎప్పుడూ కళ్ళబాధలే. ఇంత మందం కళ్ళద్దాలు పెట్టుకుని తిరిగే తనని రకరకాల పేర్లు పెట్టి అపహేళన చేసేవారు. హింసించడంలో ఈ మనుషులకి ఎంత తృప్తి ఉంది!

'రోడా బుడ్డి' అనేవాళ్ళు-

'చాటసారీ' అని పిలిచేవాళ్ళు-

అన్నీ ఓర్చుకునేవాడు. ఉద్యోగంలో చేరాక కూడా తనకీ బాధలు తప్పలేదు. ఎప్పుడయినా ఆఫీసు పనిలో తనేమైనా పొరపాటు చేస్తే ఆఫీసరు చెడామడా తిట్టేవాడు 'మీరే ఇంత గుడ్డి రాతలు రాస్తే ఎలా గండీ!' అని విసురుకునేవాడు. ఆ తిట్టు తన గుండెలో గునపంలా గుచ్చుకునేది. ఛ! ఇలా సగం సగం చూపుతో బ్రతుకే ఒక నరకంగా గడపడం కన్నా పూర్తిగా గుడ్డివాడిగా పుట్టినా బావుండేది అని ఒక్కోసారి ఆవేదనతో అనుకుంటూ ఉండేవాడు.

అప్పుడు-

తన బ్రతుక్కి ఆశ, ఊపిరి, అర్థం అన్నీ ఒక్క సరస్వతి మాత్రమే! తనని ఓదార్చేది. సరస్వతి సాన్నిధ్యంలో అన్ని అవమానాలనీ మరిచిపోయేడు తను!

శ్రీను ఉద్యోగంలో చేరాక వాడికి పెళ్ళి చేశారు. అప్పటికింకా తనకి అయిదేళ్ళ సర్వీసు ఉంది.

కానీ, తనచూపు బాగా క్షీణించిపోయింది. ఒకసారి పెద్ద జ్వరం వచ్చి చూపు పూర్తిగా పడిపోయింది.

తను శాశ్వతంగా అంధుడై పోయేడు. ఆపరేషన్ జరిగినా ఫలితం లేకపోయింది! ఉద్యోగం పోయింది. తనుబాధతో విలవిల్లాడిపోయేడు.

ఉద్యోగం పోయేక తను ఒంటరితనం ఎలా భరించడమా అని భయపడేవాడు. కానీ సరస్వతి అస్తమానూ తన దగ్గర కూచుని కబుర్లు చెబుతూ తన మనసుకి వూరట00 కలిగించేది. సాహిత్యమంటే తనకి చాలా ఇష్టం. సరస్వతి రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం చదివి వినిపిస్తూ ఉండేది. మరీ మరీ అడిగి ఇష్టంగా విరాటపర్వం చదివించుకునేవాడు.

మధ్యాహ్నం పూట తను వాలుకుర్చీలో పడుకుని ఉంటే సరస్వతి దీపారాధనకు వత్తులు చేసుకుంటూ క్షేత్రయ్య పదాలు పాడేది. ఎంత మధురంగా పాడేదని!

'సీతారాముల పెళ్ళి' సరస్వతి పాడితేనే వినాలి! అప్పుడప్పుడు వారపత్రికలు, మాస పత్రికలు శ్రీను పట్టుకొని వస్తే అందులోని కథలు చదివి వినిపించేది...

అయిపోయింది- ఇప్పుడంతా శూన్యం-

కల్యాణి పుట్టేక మనవరాల్ని ఆడిస్తూ జోల పాటలు పాడేది. ఆ పిల్లకి నడక రాకుండానే సరస్వతి కన్ను మూసింది. తన కంటి చీకటి మరింత కటికటయి పోయింది. చూపు లేకపోయినా తన మనో ప్రపంచాన్ని వెలుతురుమయం చేసే ఆత్మీయురాలు ఒక్కర్తీ వెళ్లిపోయింది.

ఇప్పుడంతా చీకటే!

అన్నీ భయాలే, బెంగలే, దిగుళ్ళే...

ఒంటరితనం గుప్పిట్లో ఇలా వెక్కిరిస్తూ ఉంటుంది. [illegible] జీవితం నిస్సారంగా గడుస్తోంది.

స్నానం చెయ్యడం, పూజ పూర్తి చేసుకోవడం, పేరన్ని మెతుకులు నోట్లో వేసుకోవడం. వసారాలో వాలుకుర్చీలో కూర్చోవడం. ఇదే తన దినచర్య.

ఎప్పుడూ - ఎవరైనా వస్తారని, తనతో మనసువిప్పి మాట్లాడతారని తపన! ఆశతో ఎదురు చూడ్డం. ఆ రాని మనిషి కోసం ఆ రాని స్నేహితుని కోసం. అనుకోని అతిథి కోసం!

ఎవరయినా ఫరవాలేదు ఎవరో ఒక్కరు. ఒక్కరంటే ఒక్క వ్యక్తి 'సూర్యం గారూ, మీ కోసం వచ్చేనండీ. బావున్నారా!'' అంటూ వచ్చి తన ఎదురుగా కూచుంటే చాలు - కానీ ఎవరూ రారు! తనతో మాట్లాడ్డానికి ఎవరికి మాత్రం ఏముంటుంది కనుక?

మోడువారిన చెట్టు మీద పక్షు లెందుకు వాలుతాయి?

విరిగిన ఫిడేలు తీగెల నెవరు మీటుతారు?

మనిషి కోసం, సావాసం కోసం. తోడు కోసం తనిలా తపిస్తూ ఉండాల్సిందే-

అందుకే తనీమధ్య ఒక నేస్తాన్ని తనంతట తానుగా సంపాదించుకున్నాడు! ఆ నేస్తం ఒక పిచ్చుక!

వాస్తవానికి ఆ నేస్తం తనకోసం రావటం లేదు. పిచ్చికుంక! ఎందుకొస్తుందో, మళ్ళీ ఎందుకు తుర్రుమంటుందో తెలీదు.

సరిగ్గా ఉదయం పది గంటల ప్రాంతంలో వస్తుంది. దాని రాక తను పోల్చుకోగలడు! గోడ మీద పెద్ద అద్దం ఫ్రేం మీద నిలబడుతుంది. అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంటూ టక్- టక్... మని పొడుస్తూ ఉంటుంది. విసుగు లేకుండా అలా చప్పుడు చేస్తూనే మళ్ళీ అంతలోనే ఎక్కడికో తుర్రుమంటుంది. మళ్ళీ కాసేపట్లో వస్తుంది.. అది తనకి అలవాటయిన సంఘటనే.

మొదట్లో ఆ శబ్దం ఏమిటో తనుపోల్చుకోలేక పోయేడు. అయినా లయబద్ధంగా వినిపించే ఆ చప్పుడు తన మనసుని ఆకట్టుకునేది! తరవాత ఆ శబ్దం చేసేది పిచ్చుకని వూహించ గలిగేడు. ఆ తరవాత దానితో నేస్తం కట్టేడు...

ఈ ఇంటి వాతావరణం అంతా దాదాపు నిశ్శబ్దంగా ఉంటుంది. ఉదయం పది దాటేక మరీను!

నేస్తం రాక ఇట్టే పసికట్టేస్తాడు తను! తనలోని ఒంటరితనాన్ని చంపుకొనడానికదొక మార్గంగా ఎన్నుకున్నాడు తను..

ఆ పిచ్చుక అద్దం మీద ముక్కుతో పొడుస్తూ చప్పుడు చేస్తూ ఉంటే అది తనతో ఏదో మాట్లాడుతున్నట్టే వూహాలు పేర్చుకుంటాడు తను. ఆ చప్పుడుకి జవాబు చెప్తున్నట్టుగా ముసలివేళ్ళతో వాలుకుర్చీ కర్ర చేతుల మీద 'టక్.. టక్..' మని చప్పుడు చేస్తాడు. అలా కొంతసేపు వూసుపోతుంది. అలా తన ప్రపంచాన్ని తనే సృష్టించుకుని కాలం వెళ్ళబుచ్చుతున్నాడు తను!

* * *

తుర్ర్.. ర్ర్.. ర్ర్..

'ఓహో! నేస్తం రా! నీ కోసమే చూస్తూ కూచుంటే ఇంత ఆలస్యం చేశావేం!' సూర్యం గారు సంతోషంగా మనసులో అనుకున్నారు.

అద్దంమీద చప్పుడు మొదలయింది.

టక్... టక్... టక్...

జవాబుగా సూర్యం గారి చేతివేళ్లు కుర్చీ కర్ర మీద చప్పుడు చెయ్యడం ప్రారంభించేయి.

ప్రశ్నలూ, సమాధానాలూ అన్నీ సూర్యంగారి మనసులోనే రూపొందుతున్నాయి.

టక్... టక్...

(తాత గారూ! ఇవాళింత ఆనందంగా కనిపిస్తున్నారేం?)

టక్.. టక్..

(అవును నేస్తం! ఇవాళో విశేషమే ఉంది)

టక్.. టక్..

(ఇవాళ నన్ను కలవడానికి విజయవాడ నుంచి చక్రవర్తి గారని ఒక స్నేహితులు వస్తున్నారు నేస్తం! ఇవాళ నాకెంత ఆనందంగా ఉందో తెలుసా? మా రామం లేఖ వ్రాశాడు వాడికి వైజాగ్‌లో ఏదో పనుందిట. విజయవాడలో వాడి ఫ్రెండు చక్రవర్తి గారని, ఆయన కూడా వాడితో బయలుదేరుతున్నారు. ఆయనకి కూడా విశాఖలో ఏవో స్వంత వ్యవహారాలున్నాయట. ఆయనకి నా సంగతి చెప్తే- నన్ను చూస్తానని అన్నారుట తెలుసా! అందుకే అతన్ని తీసుకుని ఇక్కడి కొస్తున్నాడు రామం. అయితే ఇక్కడ అట్టేసేపు ఉండరనుకో టాటాలో దిగివెంటనే, గంటో గంటన్నరో ఉండి బస్‌లో వెళ్ళిపోతారుట. అయితేనేం- ఆ ఒక్క గంట చాలదూ! నాతో మనసు విప్పి మాట్లాడాలనుకుంటున్న మనిషి, నా కోసం- ప్రత్యేకంగా నన్ను చూడ్డం కోసమే వచ్చే వ్యక్తి- అతనితో గడపడానికి ఆ వ్యవధి చాలదూ?

నీకు తెలీదు కదూ మరి! ఆయన మంచి కథకులు కూడా! సాహిత్యంతో మంచి పరిచయం ఉన్న వ్యక్తి-

మనిషి కోసం, సావాసం కోసం పరితపించి పోతూన్న నా ఎడారి గుండెని నందనవనంగా మార్చెయ్యడానికి -

మనిషి చేరిక కోసం, మనసు పూరట కోసం, పిచ్చెత్తిపోతూన్న, శిథిలమైన నా మనసులో ఆశల పందిరి వేయడానికి ఆత్మీయతలు ఇంటిపోతున్న నా హృదయాన్ని స్నేహ జలధిలో ముంచెయ్యడానికి -

పిలుపు కోసం, పలకరింపు కోసం, పరామర్శ కోసం అనుక్షణం వ్యాకులపడుతూ ఆరాటపడే నా వెర్రి మనసుకి శాంతి ప్రసాదిస్తూ నా చెవులకి మాటల మధుర గానాలు వినిపించేటందుకు-

అవును, నేస్తం, అందుకే- అందుకే వస్తున్నారాయన. కుర్రముండవి, ప్చ్- నీకు నా అంతర్యంలో ఆవేదన అవగతం కాదులే!

మళ్ళీ అద్దం మీద పిచిక శబ్దం చేస్తోంది.. జవాబుగా సూర్యంగారి వేళ్ళు - కుర్చీ కర్రమీద నాట్యం చేస్తున్నాయి..

( మళ్ళీ వస్తావా, నేస్తం! అలాగేలే- చక్రవర్తి గారూ వాళ్ళూ వచ్చేక నువ్వు కూడా రారాదూ? వారిని చూద్దువుగాని...)

తుర్... ! ర్... ! ర్....

సూర్యంగారు నవ్వుకుని మళ్ళీ ఆలోచనల్లో పడ్డారు.

ఇదివరలో తాము మరో అద్దె ఇంట్లో ఉండేవాళ్ళు. అది బజారు వీధికి బాగా దగ్గరగా ఉండే చోటు. అలికిడి బాగా ఉండేది.

ఇంత పిచ్చి పట్టినట్టుగా కూర్చునే బాధ అప్పుడుండేది కాదు. ఆ వీధిలోనే ఒక రిటైరయిన మాష్టారు ఉండేవారు. ఆయన రోజూ సాయంత్రం పూట వచ్చి కాసేపు కూచుని పిచ్చాపాటీ మాట్లాడి వెళ్ళేవారు. కాలక్షేపం బాగానే జరిగిపోయేది.

అది కాకపోయినా, ఆ వీధి వెంట తరుచుగా వెళ్ళే బస్‌లూ, లారీలు, రిక్షాలూ, మనుషులూ... ఆ వాతావరణం, ఆ చప్పుడుతో తనకి సన్నిహితమయిన పరిచయం ఉండేది. అలా పొద్దంతా పూసుపోయేది.

బస్‌ల హారన్ల బట్టి అది ఏ బస్సో, అప్పుడు టైమెంత అయి ఉంటుందో వూహించుకుంటూ ఉండేవాడు. తన అంచనాకి సరి [illegible] లా గడియారం గంటలు వినిపిస్తే నవ్వుకునేవాడు. రిక్షా బెల్లులు వింటూ ఆ వీథంట ఎన్ని వెళ్తున్నా [illegible] సరదాకి లెక్క పెట్టేవాడు.

ఇక స్కూళ్ళు వదిలే వేళప్పుడు మరీ ఉల్లాసంగా ఉండేది తనకి- ఆ పిల్లలు కేరింతలు కొడుతూ కబుర్లు చెప్పుకుంటూ గడప ముందు నుంచి వెళ్తుంటే గమ్మత్తుగా- హాయిగా ఉండేది...

ఉండీ ఉడిగీ సినిమా వాళ్ళ పాటల రిక్షాలు ఏవో రికార్డులు వినిపిస్తూ తిరిగేవి...

అద్దె తక్కువని చెప్పి, శ్రీను వూరికి మారుమూల ఈ ఇల్లు అద్దెకి తీసుకుని ఇల్లు మార్చేడు. ఈ ఇంట్లో దిగేక తనకి జీవితం స్తంభించి పోయినట్లుంది! ఒంటరితనం తనని చుట్టు ముట్టి ఉక్కిరి బిక్కిరి చెయ్యడం ప్రారంభించింది...

శకుంతలా, శ్రీనూ తనతో మనసు విప్పి మాట్లాడరు. శకుంతలయితే తన ఉనికిని గుర్తించడమే భరించలేనట్లుగా ప్రవర్తిస్తుంది. ఆమె మాటలతో, చేతలతో ఎన్ని పర్యాయాలు తన మనసు గాయపడింది కాదు?

అర్థం పర్థం లేని నిస్సారమయిన గ్రంథంలోని ఒక్కొక్క పేజీలాగా తన బ్రతుకులో ఒక్కోరోజు భారంగా, దిగులుగా గడుస్తోంది.

ప్చ్! ఇంత కాలానికి...

* * *

వీధిలో రిక్షా ఆగిన చప్పుడు.

తెలీని తత్తరపాటుతో సూర్యంగారి గుండె స్పందించింది. అ ప్రయత్నంగా పెదవులు తడుపుకున్నారు. వాలు కుర్చీలో ముందుకు వంగేరు.

మెట్ల మీద అడుగుల చప్పుడు...

సూర్యంగారి మనసు ఆర్ద్రంగా చలించి పోతోంది. తనకోసం, తనని చూడాలని ప్రత్యేకించి కోరి మరీ వస్తూన్న ఆ సహృదయుడు, ఆ స్నేహశీలి- చక్రవర్తిగారు- వచ్చేశారా!

'హలో! మామయ్యా! కులాసాయే కదా!' రామం గొంతు.

సూర్యం గారి కళ్ళు ఎందుచేతో చెమర్చాయి.

'నీకు ఉత్తరంలో రాసేను కదా, చక్రవర్తిగారని- ఇదిగో వీరే! మంచి కథా రచయిత- కథలే కాదు కవిత్వం కూడా రాస్తారు- నీ గురించీ, నీకున్న సాహిత్యాభిరుచి గురించీ ఒకసారి వీరితో చెప్పాను. ఈసారి ఈ ప్రాంతాలకు వచ్చినప్పుడు నిన్ను కలుసుకుంటానని అంటే తీసుకొచ్చేను. చక్రవర్తిగారూ, ఇతనే మా మామయ్య' అంటూ పరిచయం చేస్తున్న రామం గొంతు విని సూర్యంగారు సంతోషంతో తబ్బిబ్బు అయిపోయేరు!

" రండి.. అలా కూర్చోండి" అన్నారు సాదరంగా.

శకుంతల శ్రీను వచ్చి అతిథుల్ని పలకరించేరు. రామం నవ్వుతూ వాళ్ళ వెంట ఇంట్లోకి వెళ్ళాడు.

' మీ గురించి మా రామం ఉత్తరంలో వ్రాసాడు. సాహిత్యంలో కృషి చేస్తున్న మీ లాంటి వ్యక్తుల్ని కలుసుకోగలిగినందుకు నా కెంతో సంతోషంగా ఉంది! దురదృష్టవంతుణ్ణి అంధత్వం వల్ల మిమ్మల్ని చూడగలిగే భాగ్యానికి నోచుకోలేకపోయాను...' సూర్యంగారి గొంతులో జీర్ణించిన వేదన తొణికిసలాడింది.

'...'.

'సాహిత్యం గురించి అట్టే తెలిసిన వాణ్ణి కాను- కానీ కవిత్వమంటే మాత్రం పడి చస్తాను. అలాగని నేనేదో కవిత్వం రాస్తానని అనుకునేరు సుమా! అదేం లేదు- ఒకప్పుడు తెగ పుస్తకాలు చదివేవాడిని. పుస్తకాలు చదవడం అంటే ఎంత ఆసక్తి ఉందో చదివిన పుస్తకాల మీద అభిరుచి గల మిత్రులతో చర్చ పెట్టుకోవడమన్నా అంతే ఇష్టం నాకు...' ఇంత ఉత్సాహంతో తనేనా మాట్లాడుతున్నది అని ఆశ్చర్యపోయేరు సూర్యంగారు.

'...'

'అదంతా ఒకప్పటి మాటలెండి! "అవి చలించును తమ చర్మ కవచమెప్పుడో, బ్రతికిన దినాల

తలపోత బరువు చేత!'' అని శ్రీశ్రీ గారు సుప్తాస్థికలులో అన్నట్టు -' అంటూ నవ్వి ఆగేరు...

తనలా మాట్లాడేస్తూ ఉంటే చక్రవర్తిగారు ఒక్క మాట కూడా మాట్లాడక పోవటం అతనికి ఆశ్చర్యం కలిగించింది. ఇంతకీ అతనక్కడ కూచుని ఉన్నారో- వాళ్ళ వెంట ఇంట్లోకి వెళ్ళి పోయేరో అని అనుమానం వచ్చింది.

'చక్రవర్తి గారూ...' ఏదో అనబోయి సంశయంతో ఆగిపోయేరు.

ఇంతలో రామం ఇంట్లోంచి వసారాలోకి వస్తూ అన్నాడు :

'అన్నట్టు మామయ్యా- చెప్పటం మరిచాను- చక్రవర్తి గారికి భగవంతుడు అన్నీ ఇచ్చి ఒక్క గొంతు విషయంలో మాత్రం అతనికి తీరని అన్యాయం చేశాడు... దురదృష్టవశాత్తూ చక్రవర్తిగారు వ్రాయడమే తప్ప మాట్లాడలేరు...' అంటూ చెప్పుకుంటూ పోయేడు...

సూర్యంగారు అచేతనులయిపోయినట్టుగా ఉండి పోయేరు.

అతని గుండె ద్రవించిపోయింది. కన్నీరు చెంపల మీదుగా ధారగా జారుతోంది.

ఉద్విగ్న హృదయంతో వణుకుతున్న చేతులెత్తి 'క్షమించండి...' అని మాత్రం అనగలిగేరు.

మరి కాస్సేపటికి అతిథులిద్దరూ వెళ్ళిపోయేరు. ఒంటరితనం మళ్ళీ పలకరించింది సూర్యంగారిని.

* * *

'టక్... టక్...'

'వచ్చేవా నేస్తం...' సూర్యంగారి మనసు ఆవేదనతో మూలిగింది.

ఇంతలో అతని మనుమరాలు కల్యాణి అటువేపు వచ్చినట్టుంది... 'ఛ! ఛ! ఈ పాడు పిచిక మళ్ళీ వచ్చింది? అద్దాన్ని పాడు చేస్తోంది.. వెధవపిచిక' అంటూ తువ్వాలు కాబోలు అందుకుని దాని మీదికి విసిరి తరిమి కొట్టింది.

పిచ్చుక తుర్రుమంది.

ఆ పిల్లని మందలించే స్వాతంత్ర్యం తనకా ఇంట్లో లేదని తెలిసిన సూర్యంగారు బాధతో మౌనంగా ఉండిపోయేరు!

అతని మనసు భారంగా మూలిగింది. 'పిచ్చి ముండ! అదిలించి కొడితే తుర్రుమంది.. మరిక్కడికి రావడం మానేస్తుందో, ఏమో- పాపం, నేస్తం ఎంత బెదిరిపోయిందో! క్షమించు, నేస్తం! మళ్ళీ తప్పకుండా వస్తావు కదూ!'

(ఆంధ్రప్రభ. సచిత్రవారపత్రిక. 11.4.1979)